# ఏవగింపు

కెరటాలు వువ్వెత్తున ఎగిసిపడే సముద్రంలా చాలా ఆనందంగా ఎగిసిపడుతోంది శ్రీనివాసరావు మనసు. తన చిరకాల వాంఛ నెరవేర బోతున్నందుకు, ఇన్నాళ్ళకు తనని చూసి నవ్వేవాళ్ళ నోరు కట్టించే అవ కాశం వచ్చినందుకు!

అన్ని పత్రికలూ అతని రచనల్ని త్రిప్పికొట్టినా ఆకాశవాణి మాత్రం అవకాశమిచ్చి రచయితగా ముద్ర వేయబోతోంది.

ఆఫీసులో అందరికీ పెద్ద ఎత్తున పార్టీ ఇచ్చి సగర్వంగా అనౌన్స్ చేసాడు. కథని విని ఆకాశవాణికి మీ అమూల్య అభిప్రాయాలు రాయమని అభ్యర్థించాడు కూడా! ఊళ్ళో వున్న వాళ్ళందరికీ చెప్పడం కాగానే పొరుగు వూళ్ళ వాళ్ళకి వుత్తరాలూ రాసాడు. అంతటితో పబ్లిసిటీ కార్య క్రమం పూర్తయింది. ఆ రోజు కోసం ఆత్రంగా ఎదురుచూడసాగాడు.

బ్రాడ్‌కాస్టింగ్ తేదీ రానే వచ్చింది.

ప్రసార సమయానికి ఇంటి చుట్టుప్రక్కల వాళ్ళని, ఇంట్లోనివాళ్ళని అందర్నీ అరెస్టు చేసినట్లు రేడియో దగ్గరకు తీసుకొచ్చి పడేసాడు.

కథ ప్రసారమయ్యే టైమైంది.

ఛటుక్కున వాల్యూమ్‌ని పెంచాడు.

చీమ చిటుక్కుమన్నా వినిపించే నిశ్శబ్దం ఒక్కక్షణం.

హఠాత్తుగా రేడియో అరిచింది—

"ప్రకటించిన కార్యక్రమానికి బదులుగా ప్రధానమంత్రి రాష్ట్ర పర్యటన విశేషాలు....''

ఒక్కసారి అందరూ ఘొల్లుమన్నారు.

శ్రీనివాసరావు కోపంతో వూగిపోసాగాడు.

"శ్రీనివాసరావుగారూ! మీ కథ రానట్టేగా.... వస్తాం." ఒక్కొక్కరే రేడియో దగ్గరనుంచి కదిలారు.

"పరువు తీశారు కదండీ...." భార్య సన్నాయి నొక్కులతో మరింతగా క్రుంగిపోయాడు శ్రీనివాసరావు.

సరిగ్గా ఈ సంఘటన జరిగిన వారం రోజులకి రేడియో వింటున్న శ్రీనివాసరావు వులిక్కిపడ్డాడు.

"మేము ప్రసారం చేసే కార్యక్రమాల్ని శ్రద్ధగా విని తమ అభిప్రాయాల్ని రాస్తున్న శ్రోతలకి ముందుగా మా ధన్యవాదాలు. గతవారం ప్రసారమైన శ్రీనివాసరావుగారి 'ఏవగింపు' కథ మాకు నచ్చిందంటూ మా కార్యాలయానికి అసంఖ్యాకంగా వుత్తరాలు వచ్చా"యంటూ పేర్లు చదువుతున్నారు.

భార్య ఎక్కడ వింటుందోననే భయంతో చటుక్కున కట్టేశాడు. ఆ పేర్లన్నీ తను కథమీద అభిప్రాయం రాయమని కోరిన మిత్రులవే! పార్టీ తీసుకున్నామన్న మొహమాటంతో వినకుండా వుత్తరం రాసిపడేసారు మహానుభావులు! అప్పుడు శ్రీనివాసరావుకి ఏవగింపు కలిగింది—రేడియో మీద, మిత్రుల మీదకాదు; తనమీద, తన హాబీమీద!

(హాస్యప్రియ)